క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లుతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

ఫోన్‌తో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం ఫార్మర్ ఐడీ కేటాయింపు రిజిస్ట్రేషన్‌ను చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అందుబాటులో లేకుంటే ఫోన్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఐడీ నంబరు పొందవచ్చని తెలిపారు. సకాలంలో గ్రామంలో లేని రైతులు, పనిపై ఇతర గ్రామాల్లో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మరు ఐడీ లేని వారికి ప్రభుత్వ పథకాలు పొందే అర్హత ఉండదని చెప్పారు.

నవ్వుల రేడు రాజబాబు


ప్రతిభా మూర్తుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సాహిత్యాభిలాషులు

అద్దంకి: నవ్వుల రేడు రాజబాబు అని లక్కరాజు శ్రీనివాసరావు అన్నారు. చిన్న కాంతయ్య పిచ్చమ్మ గార్ల సేవా సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రతిభా మూర్తులు కార్యక్రమాన్ని ప్రముఖ రంగస్థల నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు కళావేదికపై నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్ అధ్యక్షత వహించారు. ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు మిట్టా కామేశ్వరశర్మ ఆర్థిక సహకారం అందించిన ఈ సభలో మల్లవరపు జాన్‌సాహెబ్ గురించి నిమ్మరాజు నాగేశ్వరరావు సభకు వివరించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు అద్దంకి బ్రాంచ్ మేనేజరు ఇట్టా వెంకటేశ్వర్లు, పుటరాజు శ్రీరామచంద్రమూర్తి, వారణాశి రఘురామశర్మ, అద్దంకి లెవీ ప్రసాద్, చందలూరి నారాయణరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఎండీ రఫీ, పీసీహెచ్ కోటయ్య, ఎస్‌కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మేలు మా తల్లీ.. కరుణించవా!


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మతల్లి

కారంచేడు: దశాబ్దాలుగా గ్రామదేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి విశిష్టదినంగా ఉండటంతో భక్తులు, గ్రామస్తులు, ఆడపడుచులు, మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇష్టమైన పొంగళ్ళు అమ్మవారికి సమర్పించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.


విద్యార్థులు, ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖాధికారులు


వైజ్ఞానిక ప్రదర్శనలో మల్టీపర్పస్ అగ్రికల్చర్ మిషన్

చిన్నారుల ఆవిష్కరణ భళా!

- రైతుల కోసం మల్టీ పర్పస్ అగ్రి మిషన్
- సైన్స్ ఉపాధ్యాయిని పర్యవేక్షణలో తయారు చేసిన విద్యార్థులు
- మూడురకాల పనులు తేలికగా చేసుకోవచ్చు
- జిల్లా, రాష్ట్ర, దక్షిణ భారతస్థాయి ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన పరికరం


కొల్లి మోహనాంజలి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మంచి గురువులభిస్తే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరడం కష్టమేమీ కాదు. బాపట్ల జిల్లాలోని సంతమాగులూరు మండలంలోని మక్కెనవారి పాలెం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు టీచర్‌గా పనిచేస్తున్న మోహనాంజలి ఈ కోవకే చెందుతారు. పాఠాలు బోధించటమే కాకుండ విద్యార్థులకు సైన్సు పట్ల ఆసక్తిని పెంచుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమంగా రాణించేలా కృషి చేస్తున్నారు. చిన్న సన్నకారు రైతులకు మూడు రకాలు ఉపయోగపడే మల్టీ పర్పస్ మిషన్‌ను చిన్నారులు ఉపాధ్యాయుని మోహనాంజలి పర్యవేక్షణలో తయారు చేశారు. ఇది జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా అవార్డు అందుకోవడం విశేషం. 9 వతరగతి చదువుతున్న చదలవాడ సాయిరాం ధారజ్, కుంచాల వెంకటేష్‌తో తయారు చేయించిన మల్టీ పర్పస్ మిషన్ విశేషంగా ఆకట్టుకుంది. పాత సైకిల్ తీసుకొని అందులో ఒక చక్రం, హ్యాండిల్, రాడ్‌లు ఉపయోగించారు. ఈ మిషన్‌ను నడపటానికి విద్యుత్ అవసరం లేదు. రైతు నెట్టుకుంటు వెళుతూ పిచికారీ చేసుకోవచ్చు.. ఎరువును నారు మళ్లలో ఎద పెట్టవచ్చు.. అలాగే దీని కింద బిగించిన గొర్రు ఆధారంగా దున్నడమే కాకుండా కలుపును కూడా నివారించవచ్చు. ఇలా మెట్ట రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీనిని చూసిన రైతులు కూడా ఉపాధ్యాయిని, విద్యార్థులను అభినందించారు.


పొలంలో పిచికారీ చేస్తున్న మిషన్

మొదటి స్థానంలో..

మల్టీపర్పస్ అగ్రికల్చర్ మిషన్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన విద్యావైజ్ఞానిక సదస్సులో రాష్ట్రానికి నాలుగో స్థానం వచ్చేలా చేసింది. గత నాలుగు సంవత్సరాలుగా అనేక అనేక ఆవిష్కరణలతో గ్రామస్తులకు అవగాహన కల్పించి జిల్లా, రాష్ట్ర, సౌత్ ఇండియా, జాతీయ స్థాయిలో అనేక అవార్డులను పొందేలా చేయడంపై అంతా అభినందిస్తున్నారు.


లభించిన అవార్డులు

ఆహార ఉత్పత్తుల తయారీకి రుణాలు


వెలుగు క్యాంపెయిన్‌లో మాట్లాడుతున్న జిల్లా బ్యాంక్ లింకేజ్ మేనేజర్ లక్ష్మణాచారి

ఇంకొల్లు (చినగంజాం): మహిళా స్వయం సహాయక గ్రూపులకు ఆహార ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవటం ద్వారా ఆర్థిక లబ్ధి పొందేందుకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తామని డీఆర్‌డీఏ (వెలుగు)బ్యాంక్ లింకేజ్ డీపీఎం లక్ష్మణాచారి అన్నారు. ఇంకొల్లు మండలం వెలుగు కార్యాలయంలో ఆదివారం ప్రధాన మంత్రి ఫార్మాలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా గ్రూపుల్లో ఆహార పదార్థాలను తయారు చేసే వారిని గుర్తించి ఒక్కొక్కరికి మొదట విడతగా రూ. 40 వేల రుణాన్ని అర్ధ రూపాయి వడ్డీతో ఇస్తామన్నారు. అర్హత ఉన్న గ్రూపు సభ్యులను గుర్తించి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని బాపట్ల వెలుగు డీఆర్‌డీఏ డీపీఎం రవీంద్ర బాబు తెలిపారు. డీఆర్పీ డి. సురేష్ లబ్ధిదారులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయాన్ని తెలియజేశారు. జీవనోపాధుల ఏపీఎంలు కె. రవికుమార్, పి. ప్రమీల, పర్చూరు నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాల ఏపీఎంలు అనురాధ, రామకృష్ణ, మోహనరావు, సుబ్బారావు, వెంకటరావు, సీసీలు, అకౌంటెంట్‌లు, ఆక్టివ్‌గా ఉన్న వీఓఏలు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


చీరాల వాడరేవులో పర్యాటకులతో కళకళలాడుతున్న తీరం

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు తీరంలో ఆదివారం సందడి నెలకొంది. చీరాల, పర్చూరు, చిలకలూరిపేట తదితర నియోజకవర్గాలకు చెందిన పర్యాటకులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో వాడరేవుకు రావడంతో పర్యాటకుల కళ సంతరించుకుంది. చీరాల వాడరేవుకు అధికసంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందంగా తీరంలో గడిపారు. యువకులు, చిన్నారులు తీరంలో సందడి చేస్తూ స్నానాలు చేసి సముద్రపు మన్నుతో ఆటలాడుకుంటూ హాయిగా గడిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సామాజిక భావోద్వేగ అభివృద్ధిపై శిక్షణ

చినగంజాం: జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సామాజిక భావోద్వేగ అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు సృజనాత్మకతను అలవర్చుకునే విధానం, అనుకూలమైన బోధన అభ్యసన సామగ్రి రూపొందించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులు.. సమాజాన్ని భాగస్వామ్యం చేయడంపై శిక్షణ ఇచ్చారు. పుట్టినరోజు వేడుకలు చేసే విధానం గురించి తెలియజేశారు. హెచ్‌ఎం కె. రామారావు, డీఆర్పీలు శ్రీనివాసరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, కె. వాణిశ్రీ, ఎస్. సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులు లేకుండానే కేక్ కటింగ్

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా ఆదివారం కేక్ కటింగ్ ఆర్భాటంగా నిర్వహించారు. అయితే చిన్నారులు లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలే చిన్నారుల పాత్ర పోషించటం విశేషం. సంతమాగులూరు సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 134 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 12 రోజులు రీసోర్సు పర్సన్‌తో శిక్షణ, 28రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందాల్సి ఉంది.


బల్లికురవలో పుట్టినరోజు వేడుకల్లో కేక్ కటింగ్

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం, పూర్వాషాఢ నక్షత్రం ఏకాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం


బ్రహ్మోత్సవ పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: మండలంలోని సంతరావూరు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి వారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామికి కళ్యాణం నిర్వహించారు. యాజ్ఞిక స్వామి పార్థసారథి, అర్చకులు దిట్టకవి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ యార్లగడ్డల లక్ష్మి, గోవిందు సుబ్బారావు, ఆరమండ్ల సుబ్బారావు, తోటకూర సుబ్బారావు, దేవాలయ ఎగ్జిక్యూటివ్ అధికారి పోతిన శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా


విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేటపాలెం: కరాటే పోటీల్లో ప్రతిభ కనపర్చి చిన్నారులు పతకాలు సాధించారని కరాటే మాస్టర్ వి. బ్రహ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఆదివారం చిలకలూరి పేటలో జవహర్‌లాల్ నెహ్రూ స్నాతకోత్సవం సందర్భంగా 37వ జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. వి. హితేష్‌కుమార్, కేఎస్‌కే మఫేజ్, కె. హేమంత్ సాయి బంగారు పతకాలు సాధించారు. బాలకల విభాగంలో టి. హసీనా, కె. శ్రీ మునాలిని పి. సహస్ర, పి. హారిక బంగారు పతకాలు సాధించారు. యశ్వంత్ జి. సాత్విక్, రొనాల్డ్, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మన్‌దీప్ రెడ్డి, ఎం. రాధా మోహన్, కె. సూర్యలోకేష్ రెడ్డి, సాయి రెడ్డి, ఎం. అసుదీప్ శ్రవణ్, 3వ స్థానంలో నిలిచారు. ఎం. హాసిని, శ్రీ ఆరాధ్య, యు. పరిణీత 3వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. చిన్నారులను ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్. నాగమల్లిక అభినందించారు.

రామానంద ట్రస్ట్ సేవలు అభినందనీయం


వైద్య శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం , బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 1196 మంది ఈ ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆశ్రమ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ గత ఇరవై రెండేళ్ల నుంచి రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక మెడికల్ క్యాంపులు, పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, విద్యాభివృద్ధికి పూర్తి సహకారం, గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అనేక విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రతి నెలా ఉచిత సుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడ మందులు అందిస్తున్నామని ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. షుగరు వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు పాటిస్తూ ఆహార నియమాలు, వ్యాయామాలు చేయాలన్నారు. శిబిరానికి హాజరైన వారికి అల్పాహారం, భోజన ఏర్పాట్లును చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్ పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయ ఏర్పాట్లు పరిశీలించిన గాదె


సూచనలిస్తున్న గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం): పర్చూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లుకు సంబంధించి పలు సూచనలు తెలిపారు. మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, కోట శ్రీనివాసరావు, గాజుల రమేష్, ఉప్పలపాటి అనిల్, తులసి నాగమణి, దాసరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనే లక్ష్యం

చీరాల: నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం చీరాల మండలం లక్ష్మీపురం యానాది సంఘంలో నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ బాపట్ల సిబ్బందితో కలిసి గ్రామస్తులతో మాట్లాడారు. నాటుసారా వలన కలిగే నష్టాలను, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో మెలగాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ

అద్దంకి రూరల్: బాలికలు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఉండాలని సీఐ ఏ. సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు తలెత్తితే ఉపాధ్యాయులను వివరించి పరిష్కరించుకోవాలన్నారు. హాస్టల్‌లో ఉన్న వసతుల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

340 మందికి వైద్య పరీక్షలు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ స్థాపించి 120 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పర్చూరులో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన తోకల తరుణ్, పర్చూరుకు చెందిన కోట శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు ఆర్థిక సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో 340 మందికి కాటూరి మెడికల్ కాలేజీ వారు గుండె, ఊపిరితిత్తులు, గొంతు, చెవి, ముక్కు, కళ్ళు, చర్మవ్యాధులకు సంబంధించిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులను కాటూరి ఆస్పత్రికి రావాల్సిందిగా సూచించారు. వారి కోసం సోమవారం ఉదయం 8 గంగలకు పర్చూరు రోటరీ భవనం నుంచి ఉచితంగా బస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కె. ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, రావి సత్యనారాయణ, తేళ్ళ రమేష్ చంద్ర, డి. శేషబాబు, పంబి సదానందరెడ్డి, రావి సతీష్ బాబు, వైద్య సిబ్బంది డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వంశి, డాక్టర్ గౌతం, డాక్టర్ పార్వతి, డాక్టర్ మాధురి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జమీల తదితరులు పాల్గొన్నారు.


మార్టూరు: రామ్ జనార్దన్ కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం


చీరాల: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మార్టూరు: రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 120వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక రామ్ జనార్దన్ కాలనీలో మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 1905 వ సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీ రోటరీ క్లబ్ స్థాపించిన పాల్ హ్యారీస్ చిత్రపటానికి రోటరీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేసి స్థానికులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ గత 120 సంవత్సరాల్లో 200 దేశాల్లో విస్తరించి అట్టడుగు వర్గాలకు చెందిన లక్షలాది మందికి సేవా కార్యక్రమాల ద్వారా సహాయం చేయడం గర్వకారణం అన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గారపాటి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జనార్దన్ కాలనీ వాసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ మార్టూరు కార్యదర్శి మాదాల సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు రావి అంకమ్మ చౌదరి, తాళ్లూరి సాంబశివరావు, షేక్ ఖాజా హుస్సేన్, కోశాధికారి గరిమిడి శ్రీనివాసరావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల, గుంటూరు పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం స్థానిక రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 148 మంది కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అబోలి, మేఘన పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేశారు. చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, మామిడాల శ్రీనివాసరావు, జీవై ప్రసాద్, ప్రతాప్, రఘుకుమార్, మురళీకృష్ణ, పూర్ణా, శ్రీనివాసరావు, శ్రీనివాసబాబు, డీవీ సురేష్, హాస్పిటల్ ఇన్‌చార్జి నాగబాబు, సిబ్బంది, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

జె పంగులూరు: పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని ముప్పవరం గ్రామంలో జరిగింది. ముప్పవరం గ్రామానికి చెందిన ఇంటూరి చిన్న సిద్దయ్య (54) ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో మేత కోస్తుండగా త్రాచు పాము సిద్దయ్య కాలుపై కాటు వేసింది. ఒంగోలులోని కిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడని బంధువులు తెలిపారు. సిద్దయ్యకు భార్య మాధవి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సిద్దయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సేవే రోటరీ ధ్యేయం


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు

అద్దంకి రూరల్: సేవా మార్గమే రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ 120వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చప్పిడి వీరయ్య మాట్లాడుతూ రోటరీ ప్రపంచ వ్యాప్తంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, వీరవల్లిరుద్రయ్య, బీవీ కృష్ణారెడ్డి, గంగాధరరావు, కూటుకూరి రామకోటేశ్వరరావు, అలహరి హరిప్రసాద్ బాచిన పూర్ణచంద్రరావు. నర్రా శ్రీలక్ష్మీ, దివాకర దత్తు ఖజావలి పాల్గొన్నారు.